సాక్షి నిజామాబాద్

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



బాల్క సుమన్‌పై చర్యలు..

సీఎం రేవంత్‌రెడ్డిని పరుష పదజాలంతో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దూషించడం పై కాంగ్రెస్ నేతలు ఆందోళనలు చేశారు.

- 9లో ▸



సొసైటీలో విచారణ

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదు రావడంలో అధికారులు మెంట్రాజ్‌పల్లి సొసైటీలో విచారణ చేపట్టారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.2 /22.8

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



సుభాష్‌నగర్: జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం సందర్శించారు. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈమేరకు కలెక్టర్ వరుసగా రెండోరోజు మంగళవారం ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు పరిశీలన కోసం ఈసీఐఎల్ ఇంజినీర్లు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించారు. ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ ఉన్నారు.

డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ జైపాల్ రాజీనామా



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి వ్యవసాయ సహకార సంఘం(సొసైటీ) చైర్మన్ గజవాడ జైపాల్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం రాత్రి డీసీవో శ్రీనివాస్‌ను కలిసి రాజీనామా పత్రం అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జైపాల్ రాజీనామాను డీసీవో ఆమోదించారు. ఆయన వెంట కాంగ్రెస్ డిచ్‌పల్లి మండలాధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ ఉన్నారు.

అవిశ్వాస సమావేశం రద్దు

డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ జైపాల్‌పై డైరెక్టర్లు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై బుధవారం అవిశ్వాస సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే మంగళవారం రాత్రి చైర్మన్ పదవికి జైపాల్ రాజీనామా చేయడంతో అవిశ్వాస సమావేశం రద్దు చేసినట్లు డీసీవో శ్రీనివాస్ డైరెక్టర్లకు నోటీసులు జారీ చేశారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



ఎడపల్లి(బోధన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జానకంపేట్‌లో బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో గర్ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె గంగారెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా చేరుతున్నాయని ఆరా తీశారు. పథకాలపై అవగాహన కల్పిస్తూ ఏవిధంగా లబ్ధి పొందాలనే విషయాన్ని ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తోందన్నారు. బీజేపీ దేశ ప్రజలను కాపాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి, బోధన్ అసెంబ్లీ కన్వీనర్ కుర్మెళ్ల శ్రీధర్, మండలాధ్యక్షుడు కోలా ఇంద్ర కరణ్, నాయకులు, ఉప్పు సురేష్, సజన్, ప్రవీణ్, గెంటే శ్రీనివాస్, సంజీవ్ పాల్గొన్నారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

నిజామాబాద్ అర్బన్: నవోదయ ప్రవేశ పరీక్ష ఈ నెల 10న నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన తెలిపారు. నవోదయలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నామన్నారు. తొమ్మిది, 11వ తరగతిలో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహించనున్నామన్నారు. కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి అభ్యర్థులు ఉదయం పదిన్నర గంటలకు సంబంధిత పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.



ఇక పచ్చ బంగారమే!

పసుపు రైతులకు మంచి రోజులు రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్' పథకం కింద ఇందూరు పసుపును ఎంపిక చేయడం.. ఇది వరకే ప్రధాని మోదీ పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటన నేపథ్యంలో మరిన్ని ప్రయోజనాలు కలుగనున్నాయని అంటున్నారు. మంగళవారం మార్కెట్‌లో పంటకు ఈ సీజన్‌లోనే అత్యధిక ధర పలికింది. భవిష్యత్తులో క్వింటాకు రూ. 15 వేలకు పైగా రావచ్చని అంచనా వేస్తున్నారు.

- ఫలితమిస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్'
- ఇందూరు పసుపునకు పథకం వర్తింపజేసిన కేంద్రం
- మరోవైపు పసుపు బోర్డు ప్రకటనతో మరింత మేలు
- ఇప్పటికే పసుపు ఎగుమతుల పెంపునకు కేంద్రం ప్రణాళిక
- నిజామాబాద్ మార్కెట్‌లో రూ. 13,823 పలికిన క్వింటా పసుపు ధర

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్' పథకం నేపథ్యంలో ఇందూరు ప్రాంత పసుపు రైతులకు మరింత మేలు కలిగే అవకాశాలు మెరుగుపడ్డాయి. ఈ పథకం కింద నిజామాబాద్ జిల్లా నుంచి పసుపు, జగిత్యాల జిల్లా నుంచి మామిడి పంట ఉత్పత్తులను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇదిలా ఉండగా ప్రధాని నరేంద్ర మోదీ పసుపు బోర్డు ప్రకటన చేయడంతో పసుపు పంట మరింత లాభదాయకం అవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా నిజామాబాద్ మార్కెట్‌లో మంగళవారం పసుపునకు క్వింటాలుకు అత్యధికంగా రూ.13,823 ధర పలికింది. ఏర్గట్లకు చెందిన రైతు బాజన్న తీసుకొచ్చిన పసుపునకు ఈ ధర దక్కింది. కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఇక్కడి నుంచి ఎగుమతులు పెంచే ప్రక్రియను మరింత ముమ్మరం చేస్తోంది. పైగా పసుపు దిగుమతులను సైతం తగ్గిస్తోంది. రానున్న రోజుల్లో క్వింటాలుకు రూ.15 వేలు పైగా ధర పలుకుతుందని రైతులు అంటున్నారు. ఈ క్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి పసుపు అమ్మకందారులు, కొనుగోలుదారులు, ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లతో మార్కెట్ యార్డులో సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు మంచి గిట్టుబాటు ధర లభించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఇది సత్ఫలితాలను ఇస్తోందని రైతులు అంటున్నారు. మరోవైపు ప్రధానమంత్రే స్వయంగా పసుపు బోర్డు ప్రకటన చేయగా, బోర్డు ఏర్పాటుపై గెజిట్ విడుదలైంది.

బోర్డు ఏర్పాటుతో..

తెలంగాణలో సుమారు 55 వేల ఎకరాల్లో పసుపును రైతులు సాగు చేస్తున్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 33వేల ఎకరాల్లో సాగవుతోంది. ఈ సీజన్‌లో నిజామాబాద్ మార్కెట్‌కు 6 లక్షల క్వింటాళ్ల మేరకు పసుపు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సీజన్ మొదలైన ఈ వారం రోజుల్లో ఇప్పటివరకు 12 వేల క్వింటాళ్ల ఫింగర్, బల్బ్ అనే రెండు రకాల పసుపు వచ్చింది. ఇక ఇక్కడ పసుపు బోర్డు ఏర్పాటు చేశాక అధిక కర్కుమిన్ వచ్చే కొత్త వంగడాల అభివృద్ధి జరుగుతుంది. అదేవిధంగా అంతర్జాతీయ మార్కెట్‌లో పురుగుమందుల అవశేషాలు తక్కువగా ఉన్న పసుపునకే డిమాండ్ ఉంటోంది. 0.01 శాతం మాత్రమే పురుగు మందు అవశేషాలు ఉండేలా.. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేలా బోర్డు రైతులను ప్రోత్సహిస్తుంది. దీంతో ఎగుమతులు భారీగా పెరిగి భవిష్యత్తులో ధర మరింతగా లభించే అవకాశాలు పెరుగనున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

అధిక ధర సంతోషకరం..



నేను నాలుగు ఎకరాల్లో పసుపు సాగు చేశాను. ప్రస్తుతం ఎకరం పంట మార్కెట్‌కు తీసుకొచ్చాను. 10 క్వింటాళ్ల పసుపునకు క్వింటాలుకు రూ.13,872 చొప్పున ధర పలికింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర కావడం సంతోషంగా ఉంది. పసుపును ఎండబెట్టి తీసుకొస్తే మంచి ధర వస్తుందనడానికి నా పంటకు వచ్చిన ధర నిదర్శనం. ఇక ముందు తెచ్చే పంట కూడా బాగా ఎండబెట్టి తీసుకొస్తాను.

– బాజన్న, రైతు, ఏర్గట్ల

శ్రమకు తగ్గ ఫలితం



ప్రస్తుత సంవత్సరం పసుపు పంటను సాగు చేస్తున్న రైతులకు శ్రమకు తగ్గ ఫలితం వస్తుందని అనుకుంటున్నాం. మార్కెట్‌లో మొదటి నుంచి క్వింటాలుకు రూ. 10 వేలకు పైగా ధర పలకడంతో కొంత మేర రైతుకు కలిసి వస్తుంది. పెట్టుబడి పోగా లాభం వచ్చే అవకాశం ఉంది.

– గజేందర్, రైతు, రెంజర్ల



గృహజ్యోతి అమలుకు కసరత్తు

- వినియోగదారుల వివరాల సేకరణ
- 200 యూనిట్లలోపు ఉంటేనే ఉచితం
- తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ సేకరణ

నిజామాబాద్ నాగారం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకం అమలు చేయబోతుంది. ఇందుకోసం విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు జిల్లాలో 200లోపు విద్యుత్ యూనిట్లు ఖర్చు చేసే వినియోగదారుల వివరాలను సేకరించి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దీంతో ఈ నెల 15లోపు ఇంటింటికి తిరుగుతూ నమోదు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌లు సేకరిస్తున్నారు.



నగరంలో విద్యుత్ వినియోగదారుల సమాచారాన్ని సేకరిస్తున్న సిబ్బంది

జిల్లాలో 4.60 లక్షల వినియోగదారులు

జిల్లాలో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్‌రూరల్, నిజామాబాద్ డివిజన్‌లున్నాయి. జిల్లాలో 8 లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులున్నారు. ఇందులో సుమారుగా గృహాలకు సంబంధించి 4.60 లక్షల వినియోగదారులు ఉన్నారు. జిల్లాలో విద్యుత్ అధికారులు, సిబ్బంది,స్పాట్ బిల్లర్స్ అందరూ ఇంటింటికి తిరుగుతూ మీటర్ నంబర్, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తదితర వివరాలు సేకరిస్తున్నారు. విద్యుత్ బిల్లులు తీసే మీటర్ రీడింగ్‌లో సైతం అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నెల 6 నుంచి 15 లోపు ఇంటింటికి తిరుగుతూ వివరాల ను నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

అద్దె ఇంట్లో ఉన్నా అర్హులే..

జిల్లాలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో ఎక్కువ మొత్తంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక చాలా మంది వివిధ పనుల నిమిత్తం పట్టణాల్లో నివసిస్తున్నారు. అధికారులు అద్దె ఇంట్లో ఉంటున్న వారి వివరాలు సైతం సేకరిస్తున్నారు. దీంతో పట్టణాల్లో అద్దె ఇంట్లో ఉంటున్న వినియోగదారులకు సైతం గృహజ్యోతి అమలుతో లబ్ధి చేకూరనుంది.

నెలకు రూ. 25 కోట్ల భారం..

జిల్లాలో గృహాలకు సంబంధించి వినియోగదారులు 4.60 లక్షలు ఉన్నారు. అయితే 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు వినియోగదారులు 200లోపు యూనిట్లలో ఎంతమంది ఉన్నారో డాటాను పరిశీలిస్తున్నారు. 200 యూనిట్లలోపు ఉంటేనే గృహజ్యోతి పథకం అమలు కానుంది. పథకం అమలుతో నెలకు రూ. 25 కోట్ల వరకు విద్యుత్‌శాఖపై భారం పడనుంది.

వివరాలు అప్‌లోడ్ చేస్తున్నాం

జిల్లాలో 4.60 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వినియోగదారులకు సంబంధించి తెల్లరేషన్‌కార్డు, ఫోన్ నంబర్, ఆధార్‌కార్డు, వివరాలు సేకరిస్తూ అప్‌లోడ్ చేస్తున్నాం. 200 యూనిట్లలోపు ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరిస్తున్నాం. ఒక నెల 200లోపు యూనిట్లు వాడి, మరో నెల 220 యూనిట్ల విద్యుత్ ఖర్చు చేస్తే ఏమిటనే విధివిధానాలు ఇంకా ఖరారు కాలేదు. దీనిపై త్వరలో పూర్తిస్థాయి సమాచారం రాగానే తెలియజేస్తాం.

– ఆర్ రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ప్రత్యేక బృందాలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయని డీఐఈవో రఘురాజ్ తెలిపారు. మంగళవారం రెండు విడతల్లో పరీక్షలు జరిగినట్లు పేర్కొన్నారు. ఉదయం జనరల్ విభాగంలో మొత్తం 1,302 మంది విద్యార్థులకు గాను 1,255 మంది హాజరు కాగా 47 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌లో 592 మందికి గాను 537 మంది హాజరు కాగా 55 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొనలేదని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం జనరల్‌లో 899 మంది విద్యార్థులకు గాను 868 మంది హాజరు కాగా 31మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌లో మొత్తం 442 మంది విద్యార్థులకు గాను 407 మంది హాజరు కాగా 35 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొనలేదన్నారు. జిల్లాలోని ఆరు కేంద్రాలను పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, అస్లాం, దేవారం, చిరంజీవి, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 26 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు.

విషప్రయోగమా.. వశీకరణా?

- మహిళా శిశు వికాస కేంద్రం అధికారిణికి మందు కలిపి ఇచ్చే ప్రయత్నం
- స్కెచ్ వేసిన ప్రాంగణంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణం పెర్కిట్ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా అధికారిణి పద్మపై అక్కడే పని చేస్తున్న ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విష ప్రయోగ ప్రయత్నం విఫలమైంది.అయితే నిందితులు తాము విషప్రయోగం చేయలేదని వశీకరణ మందుఇచ్చే ప్రయత్నం చేశామని చెబుతున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

మహిళా ప్రాంగణంలో డే వాచ్‌మెన్‌గా అవుట్ సోర్సింగ్‌పై విధులు నిర్వహిస్తున్న సత్యమ్మను దొంగతనాలకు పాల్పడుతోందంటూ కేంద్రం అధికారిణి పద్మ విధుల్లో నుంచి తొలగించారు. కక్ష పెంచుకున్న సత్యమ్మ అక్కడే కుక్ అండ్ ఆయాగా విధులు నిర్వహిస్తున్న దివ్యాంగురాలైన అలివేలుకు మందు తీసుకొచ్చి ఇచ్చింది. అధికారిణి తినే అన్నంలో లేదా టీలో చక్కెరతో పాటు కలపాలని ఆమెకు సూచించింది. అలివేలు ప్రాంగణంలోని ఒక విద్యార్థిని సహాయంతో టీలో చక్కెరకు బదులు మందును కలపడానికి ప్రయత్నం చేసింది. ఇది గ్రహించిన విద్యార్థిని మరో ఉద్యోగి సహకారంతో అధికారిణి దృష్టికి తీసుకెళ్లడంతో వ్యవహారం బట్టబయలైంది. తనపై విష ప్రయోగానికి ప్రయత్నించారని సత్యమ్మ, అలివేలులపై తెలంగాణ మహిళ సహకార అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పద్మావతికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు

సత్యమ్మ, అలివేణిలను ఈ నెల 1న విధుల నుంచి తొలగించి పోలీసులకు ఫిర్యాదు చేసారు. అదే రోజు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోగా రవి కుమార్ బాధ్యతలు స్వీకరించడంతో ఎస్సై అంజమ్మను విచారణ కోసం ప్రాంగణానికి పంపించారు. ఈ ఘటనపై ఎస్సై అంజమ్మను సంప్రదించగా ఇంకా విచారణ జరుపుతున్నామని కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. మరోవైపు సత్యమ్మ స్థానికంగా ఉన్న పరిచయాలతో ప్రాంగణం అధికారిణిపై బెదిరింపులకు పాల్పడుతూ తమను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలంటూ ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ఈ విషయం తెలియడంతో ప్రాంగణం అధికారిణితో మాట్లాడటానికి బుధవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.

దొంగతనాలకు పాల్పడుతున్నారనే..

ప్రాంగణంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని గుర్తించి ఉన్నతాధికారుల సూచనలమేరకు సత్యమ్మను విధుల్లో నుంచి తొలగించాము. కక్ష కట్టి ఆయాగా విధులు నిర్వహిస్తున్న అలివేలుతో కలిసి నాపై విషప్రయోగం చేసే ప్రయత్నం చేసారు. పోలీసులకు ఫిర్యాదు చేసి వారం గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేరు.

– పద్మ, జిల్లా అధికారిణి, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం, పెర్కిట్

12వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని ఎంఈడీ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈ నెల 12 తుది గడువు అని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ మంగళవారం తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 16వరకు చెల్లించవచ్చని అన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

పకడ్బందీగా 'ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం'

- నేటి నుంచి వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహణ
- నియోజకవర్గాలు, మండలాలకు ప్రత్యేకాధికారులు
- 15న పల్లెల్లో గ్రామసభలు

సుభాష్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. నేటి నుంచి 14వ తేదీవరకు రోజువారీగా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. 15న గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి అవగాహన, పంచాయతీ సిబ్బంది, యువతకు సన్మాన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు నియోజకవర్గాలు, మండలాలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రత్యేకాధికారులను నియమించారు. కాగా కార్యక్రమ నిర్వహణకు పంచాయతీ ఖాతాల్లో నిధులు నిండుకున్నాయని, ఖర్చులు ఎవరు భరిస్తారని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఫిబ్రవరి 1తో జీపీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఒక్కొక్కరికి రెండేసి చొప్పున జీపీలను కేటాయించింది. వారి ఆధ్వర్యంలో మొదటిసారిగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేకాధికారులు ప్రతిరోజు పంచాయతీల్లో పర్యటించి జీపీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గ, మండలాల ప్రత్యేకాధికారులు ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి, నిర్వహిస్తున్న కార్యక్రమాలు పర్యవేక్షించాలని సూచించారు.

నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు

నియోజకవర్గం	అధికారి పేరు – హోదా	మొబైల్ నెంబర్
ఆర్మూర్	వినోద్‌కుమార్, ఆర్డీవో, ఆర్మూర్	9491036110
బోధన్	రాజాగౌడ్ ఆర్డీవో, బోధన్	9491036893
బాన్సువాడ	చందర్‌నాయక్, డీఆర్‌డీవో, నిజామాబాద్	9281486366
నిజామాబాద్ రూరల్	రాజేంద్రకుమార్, ఆర్డీవో, నిజామాబాద్	9491036891
బాల్కొండ	గోవింద్, జెడ్పీ సీఈవో, నిజామాబాద్	9849900106

జీపీ ఖాతాల్లో నిండుకున్న నిధులు..!

గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసే నాటికే జీపీల్లో బ్యాంకు ఖాతాల్లో నిధులు నిండుకున్నాయి. ఒక్క రూపాయి లేకుండా వారం రోజుల పాటు కార్యక్రమాలు ఎలా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో ప్రస్తుతం పన్నుల వసూళ్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఆ నగదు కూడా ఏ రోజుకు ఆ రోజు ఖాతాలో జమ చేస్తున్నారు. అంతేగాకుండా గతంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర ఖర్చులు సర్పంచులు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. వాటికే నిధుల్లేక ఇబ్బంది పడుతుంటే.. ఎలాంటి నిధులు లేకుండా ఈ కార్యక్రమం ఎలా నిర్వహించాలని కార్యదర్శులు అయోమయానికి గురవుతున్నారు. కార్యక్రమం నిర్వహణ కోసం పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కార్యదర్శులు కోరుతున్నారు.

డీజీపీని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నూతనంగా నియమితులైన రవి గుప్తాను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో అసాంఘిక శక్తుల కార్యకలాపాలు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ రేట్ గురించి డీజీపీతో చర్చించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

భానుడు @ 36.5 డిగ్రీలు

- జిల్లాలో పెరుగుతున్న పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు
- మోస్రాలో అత్యధికం..

సుభాష్‌నగర్: జిల్లాలో భానుడి ప్రతాపం మొదలైంది. ఫిబ్రవరి మొదటివారం నుంచే ఎండలు మండు తున్నాయి. చలికాలం పూర్తి కాకముందే ఎండలు వే సవిని తలపిస్తున్నాయి. గడిచిన ఆరు రోజులుగా పగలు, రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం మోస్రా మండలంలో ఈ సీజన్‌లో అత్యధికంగా 36.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమో దైంది. జిల్లాలోని జక్రాన్‌పల్లిలో 36.2 డిగ్రీలు, బోధ న్ మండలంలోని బెల్లాల్‌లో 35.9, నిజామాబాద్ దక్షిణ మండలంలో 35.8, లక్ష్మాపూర్‌లో 35.4, ని జామాబాద్ ఉత్తరమండలంలో 35.3 డిగ్రీలుగా న మోదయ్యాయి. మిగతా మండలాల్లోనూ ఉష్ణోగ్రత లు గతేడాది కంటే ఎక్కువగా ఉన్నాయి. అదేవిధంగా ఉక్కపోత కూడా పెరిగింది. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వారం రోజుల ఉష్ణోగ్రతలు..(డిగ్రీల్లో)

తేదీ	గరిష్ట	కనిష్ట	తేదీ	గరిష్ట	కనిష్ట
ఫిబ్రవరి 1	32.3	19.5	4న	32.3	19.4
2న	33.9	19.9	5న	33.9	21.1
3న	31.9	20.7	6న	35.2	22.8

క్లుప్తంగా

అలీసాగర్ ఉద్యానవన పనుల పరిశీలన



ఎడపల్లి: మండలంలోని అలీసాగర్ ఉద్యానవనంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన పనులను జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, అబుడ్స్‌మన్ శ్రీనివాస్‌రావు, పలువురు అధికారులు మంగళవారం పరిశీలించారు. ఉద్యానవనంలో రూ.53లక్షలతో వివిధ నిర్మాణ పనులు చేపట్టారు. జరిగిన పనులు, నాణ్యత, ప్రతిపాదించిన మేరకే జరిగాయా లేదా అనే అంశాలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఉద్యానవనంలోని చెట్లు ధ్వంసం కావడం, మరికొన్ని ఆచూకీ లేకుండా పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీరి వెంట ఎంపీడీవో గోపాలకృష్ణ, ఉపాధి హామీ ఏపీఎం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రికి వినతి



జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి : పసుపు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీలో ఎంఎస్ఎంఈ కేంద్ర మంత్రి నారాయణరాణేను పసుపు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాట్కురి తిరుపతిరెడ్డి మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని కమ్మర్‌పల్లి, వేల్పూర్, ధర్పల్లి మండలాల్లో స్పైస్ పార్కు కోసం కేటాయించిన భూముల్లో ఇప్పటి వరకు కమ్మర్‌పల్లిలో మాత్రమే పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. మిగతా చోట్ల ఎలాంటి పనులు ప్రారంభం కాలేదన్నారు. పసుపు రైతులకు మద్దతు ధర ఇవ్వాలన్నారు. పసుపు బోర్డు విధివిధానాలు ప్రకటించి రైతులకు అండగా ఉండాలని కోరారు.


నగరంలో చైన్‌స్నాచింగ్ కలకలం..

ఖలీల్‌వాడి: నగరంలో చైన్‌స్నాచర్లు రెచ్చిపోతున్నారు. మహిళలు కనిపిస్తే చాలు ఒంటిపై ఉన్న నగదును లాక్కెళ్తున్నారు. తాజాగా మంగళవారం రాత్రి సుభాష్‌నగర్‌లోని రామాలయం వద్ద నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును దుండగులు అపహరించుకు వెళ్లారు. ఆదర్శ్‌నగర్‌కు చెందిన సీరడి నాగమణి శిశుగృహాల్లో కేర్ టేకర్‌గా పని చేస్తుంది. రాత్రి 8:30 గంటలకు పనులు ముగించుకొని తన తోటి స్నేహితురాలు లక్ష్మితో కలిసి ఇంటికి వెళ్తోంది. సుభాష్‌నగర్ రామాలయం వద్ద చీకటి ఉండటంతో అదునుగా భావించిన దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

అందెశ్రీకి దక్కిన గౌరవం

- రాష్ట్ర గీతంగా జయజయహే తెలంగాణ
- జిల్లా కవుల హర్షం

నిజామాబాద్ సిటీ: తెలంగాణ ఉద్యమానికి ఊపునిచ్చి, ఉత్తేజం రగిల్చిన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' పాటను తెలంగాణ రాష్ట్ర గీతంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో హర్షం వ్యక్తమవుతోంది. ఈ పాటను వరంగల్ జిల్లాకు చెందిన తెలుగు కవి, సినీగేయ రచయిత అందెశ్రీ రాశారు. దీంతో అందెశ్రీకి సరైన గౌరవం దక్కిందని జిల్లా కవులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వరాష్ట్ర ఆకాంక్షను నింపిన ఈ గీతంపై పలువురు కవులు, రచయితలు 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.



తెలంగాణకు ఇది గీతోదయం..



తెలంగాణ మలి ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లిన చైతన్య గీతం 'జయ జయహే తెలంగాణ' అందరికంటే ముందు ఎగిసిన వైతాళిక కవి అందెశ్రీ. ఈ పాట రాని గొంతు లేదు, ఈ పాట పాడని వేదికా లేదు. తెలంగాణకు ఇది గీతోదయం. ఇన్నాళ్లకు మా కవి హృదయాలు పులకించిపోయాయి.

– కాసర్ల నరేశ్‌రావు, ప్రముఖకవి, పాటల రచయిత

జయహో అందె శ్రీ



తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ ఇందూరు సభలలో తెలంగాణపై ప్రసంగిస్తూ ఎన్నో ఉత్తేజకరమైన పాటలు పాడారు. తెలంగాణ సాధనలో ఆయన పాత్ర అద్వితీయం, అనమాన్యం. 'జయ జయహే తెలంగాణ' పాటను రాష్ట్ర అధికార గీతంగా గుర్తించి ప్రకటించటం అభినందీయం. జయహో అందె శ్రీ.

– పంచరెడ్డి లక్ష్మణ్, కవి

పాఠ్యపుస్తకాలలో ముద్రించాలి



'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' పాటను రాష్ట్ర గీతంగా పాఠ్యపుస్తకంలో ముద్రించాలి. మలిదశ ఉద్యమంలో ఉద్యమ కారుల నిరంతర స్మరణగా మారింది. నిరసన కార్యక్రమాల్లో నేపథ్య సంగీతంలా ఆ పాట ప్రతిధ్వనించింది. ఇప్పుడు రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరం.

– ఘనపురం దేవేందర్, ప్రముఖ కవి

ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని..



రాష్ట్ర ఆవిర్భావానికి అందెశ్రీ రాసిన పాట ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణ జాతికి ప్రేరణనిచ్చిన వైతాళిక గీతం 'జయ జయహే తెలంగాణ' గీతం. ఈ గీతం ఇప్పుడు రాష్ట్రీయ గీతంగా ప్రకటించడం ఆనందంగా ఉంది. కవి అందెశ్రీకి అభినందనలు.

– వీపీ చందన్‌రావు, ప్రముఖ కవి

సంతోషంగా ఉంది



తెలంగాణ ఉద్యమ కవికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం గేయానికి ఎంతటి ప్రాధాన్యత ఉందో అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయానికి అంతటి ప్రాముఖ్యత ఉంది. మన రాష్ట్ర గీతంగా అధికారికంగా గుర్తింపు వచ్చినందుకు సంతోషంగా ఉంది. – మల్లిగోడ గంగాప్రసాద్, జాతీయ కవి

తెలంగాణ గర్వించే గీతం..



జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించడం సంతోషంగా ఉంది. ఈ గీతంలో సాహితీ వేత్తలు, కళలు, పాలకుల ఘనత, జానపదుల సాహిత్యం గనుల వర్ణన అద్భుతం. ఈ గీతంలో మొత్తం తెలంగాణ చిత్రం చిత్రీకరించబడింది. అందెశ్రీకి హృదయపూర్వక అభినందనలు.

– పింగళి గంగాధర్‌రావు, కవి

వేదికలపై పాడాను



గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం కళాకారులను, ఉద్యమకారులను గుర్తిస్తోంది. అందెశ్రీ రాసిన పాటను నేను అనేక వేదికలపై పాడాను. ఈ గీతంలో అర్థాలు బాగున్నాయి. పదాల సాహిత్యం బాగుంది. అందెశ్రీ మూలాలు నందిపేట్, ఆర్మూర్, మాక్లూర్‌లో ఉన్నాయి.

– కె గంగాధర్, కవి, గాయకుడు, నందిపేట్

ప్రభుత్వ గుర్తింపు సంతోషకరం



తెలంగాణ ఉద్యమంలో ఎంతో ప్రాశస్త్యం పొందిన అందెశ్రీ రాసిన జయ జయహే గీతం సాహిత్యానికి దక్కిన గౌరవం. ఈ గీతాన్ని గత ప్రభుత్వం దొరహంకారంతో ఎందరు మేధావులు కోరినా నిర్లక్ష్యం చేశారు. ఉద్యమానికి ఊపిరిలూదిన ఈ గీతాన్ని ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉంది.

– ఎనిశెట్టి శంకర్, ప్రముఖ కవి

తెలంగాణ ఉద్యమం గుర్తుకొస్తుంది..



అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ పాట విన్న ప్రతిసారి తెలంగాణ ఉద్యమం గుర్తుకొస్తుంది. ఈ పాటకు అంతటి చరిత ఉంది. రాష్ట్ర గీతంగా అందెశ్రీ పాడిన పాటను ప్రకటించడం ఎంతోఆనందదాయకం. కవులను గుర్తిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు. అందెశ్రీకి అభినందనలు.

– శారదాహన్మాండ్లు, కవి

కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

- ప్రకటించిన డొంకేశ్వర్ గ్రామస్తులు
- ముదురుతున్న భూ వివాదం

డొంకేశ్వర్: మండల కేంద్రంలో నెలకొన్న భూవివాదం ముదురుతోంది. కబ్జాకు గురవుతున్న గ్రామ పంచాయతీ భూములను అధికారులు కాపాడకపోతే మూడు రోజుల్లో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని గ్రామస్తులు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం జీపీ కార్యాలయ ఆవరణలో సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న జీపీ భూములను కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వాటి రక్షణకు చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. కాంప్లెక్స్‌లు నిర్మించి గ్రామాభివృద్ధి పాటుపడుతుంటే కొంతమంది అడ్డుపడి రూ. కోట్లు విలువ చేసే భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జీపీ భూములు కబ్జాకు గురికాకుండా పంచాయతీ తీర్మాణం ఉందని పైగా కంచె కూడా వేయాలని ఆదేశాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ఇదే ధోరణిని అవలంభిస్తే గ్రామస్తులం ఊరుకోమని, ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

గ్రామస్తులు సమావేశం నిర్వహించక ముందు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై రాహుల్‌తో పాటు ఎంపీవో కిరణ్, తహసీల్దార్ రాములు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. సర్వసమాజ్ కమిటీ, గ్రామస్తులతో కలిసి భూసమస్యపై చర్చించారు. అనంతరం సంబంధిత స్థలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని అధికారులు వెల్లడించారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. మంగళవారం ఉదయం నిర్వహించిన జనరల్ పరీక్షలకు 1,302మందికి 1,255 మంది హాజరుకాగా 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 592 మందికి 537 మంది హాజరు కాగా 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన జనరల్ పరీక్షలకు 899మందికి 868 మంది హాజరుకాగా 31మంది విద్యార్థులు గైర్హాజరు కాగా ఒకేషనల్‌లో 442 మందికి 407 మంది హాజరు కాగా 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాలను పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, రజీయొద్దీన్ అస్లాం, దేవారం, చిరంజీవి, పలువురు అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని సాధించాలి

డీఆర్‌డీవో చందర్‌నాయక్

డిచ్‌పల్లి: జిల్లా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లో నిర్ణయించిన బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని గడువులోపు సాధించాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ లో మంగళవారం నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశానికి డీఆర్‌డీవో హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళలు, సంఘాల్లో సభ్యులుగా లేనివారిని గుర్తించి నూతన స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి లబ్ధి కలిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే 35 శాతం సబ్సిడీ రుణాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించిన మార్కెటింగ్ కమీషన్ 10 శాతం నిధులు రూ.21,97,485 ల చెక్కును డీఆర్‌డీవో జిల్లా సమాఖ్యకు అందజేశారు. అనంతరం ఎన్నిక నిర్వహించి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా ఈ.రాధ (ఆర్మూర్)ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో మధుసూదన్, డీపీఎంలు ఎన్.శ్రీనివాస్, సంధ్యారాణి, నీలిమ, ఎం.సాయిలు, మారుతి, రాచయ్య, స్త్రీనిధి ఆర్ఎం రాందాస్, ఏపీఎం (ఐబీ) సరోజిని, సఖీ సెంటర్ సిబ్బంది, జిల్లా సమాఖ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

ఆరోపణలపై సొసైటీలో విచారణ

డిచ్‌పల్లి: మండలంలోని మెంట్రాజ్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో జరిగిన వరి ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని డైరెక్టర్ రాగం గంగాధర్ ఫిర్యాదు మేరకు జిల్లా సహకార అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. విచారణ అధికారి జిల్లా సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.పోషన్న, మానిటరింగ్ అధికారి ఆనంద్ ముందుగా సొసైటీకి వచ్చి రికార్డులను పరిశీలించారు. అనంతరం సొసైటీ పరిధిలోని అమృతాపూర్ గ్రామానికి వెళ్లి గతంలో కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించిన రైతులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. 2019 నుంచి 2023 వరకు సొసైటీ పరిధిలో జరిగిన ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని, కడ్తా, హమాలీ పేరుతో సుమారు రూ.2కోట్ల వరకు అవినీతికి పాల్పడ్డారని డైరెక్టర్ రాగం గంగాధర్ విచారణ అధికారులతో పేర్కొన్నారు. రికార్డులను క్షుణంగా పరిశీలించి, రైతులు చెప్పిన విషయాలతో నివేదిక సిద్ధం చేసి డీసీవోకు అందజేస్తామని విచారణ అధికారి తెలిపారు. సొసైటీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, కేవలం రాజకీయ కక్షతోనే కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అక్రమాలు జరిగినట్లు తేలితే తానే పూర్తి బాధ్యత వహిస్తానని సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

డీపీసీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- మార్కెటింగ్‌శాఖ ఆర్‌జేడీ ఇఫ్తాకర్ నజీబ్

సుభాష్‌నగర్: రైతులు డైరెక్ట్ పర్చేజ్ సెంటర్(డీపీసీ)లో పసుపును విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్‌శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఇఫ్తాకర్ నజీబ్ సూచించారు. మంగళవారం నిజామాబాద్ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన డీపీసీని ఆర్‌జేడీ ప్రారంభించారు. ఈసందర్భంగా నజీబ్ మాట్లాడుతూ డైరెక్ట్ పర్చేజ్ సెంటర్‌లో రైతులు పండించిన పంటను బాగా ఎండబెట్టి, శుభ్రం చేసి తీసుకురావాలని తెలిపారు. తేమశాతం 18 లోపు ఉంటేనే డీపీసీలో అమ్మేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎండబెట్టిన పసుపును మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తే రాబోయే రోజుల్లో మంచి ధర వస్తుందని పేర్కొన్నారు. అలాగే డీపీసీలో అమ్ముకునే రైతులకు రెండుశాతం కమీషన్ కోత కూడా ఉండబోదన్నారు. సమావేశంలో సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల మార్కెటింగ్ అధికారులు గంగు, రమ్య, గ్రేడ్–2 సెక్రెటరీ విజయ్‌కిషోర్, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు లాభిశెట్టి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి కమల్ కిషోర్ ఇనానీ, మాస్టర్ శంకర్, కమీషన్ ఏజెంట్లు, రైతులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో పసుపును పరిశీలిస్తున్న ఆర్జేడీ

ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశం

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆర్‌జేడీ ఇఫ్తాకర్ నజీబ్ ఉమ్మడి జిల్లాల అధికారులు, మార్కెట్ కమిటీల సెక్రెటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో మార్కెట్ల పనితీరు, కార్యకలాపాలపై కమిటీల వారీగా సమీక్షించారు. మార్కెట్ కమిటీల ఆదాయ లక్ష్యాలు, వచ్చిన ఆదాయంపై అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల మార్కెటింగ్ అధికారులు గంగు, రమ్య, గ్రేడ్–2 సెక్రెటరీ విజయ్‌కిశోర్ పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

- మోర్తాడ్‌లో లభించిన బాలుడి ఆచూకీ
- తల్లిదండ్రులకు అప్పగింత

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతం నుంచి కిడ్నాపర్లు మూడేళ్ల బాలుడిని ఎత్తుకెళ్లగా.. రంగంలోకి దిగిన పోలీసులు కేసు ఛేదించారు. యాచకవృత్తి చేసుకునే వారు కంఠేశ్వర్ ప్రాంతంలో నిద్రిస్తుండగా, ఆదివారం రాత్రి కిడ్నాపర్లు మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు పోలీసులు బృందాలు రంగంలోకి దిగి విచారణ చేపట్టాయి. అయితే.. మోర్తాడ్ మండల పాలెం వరద కాలువ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బాలుడిని వదిలి వెళ్లారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని మోర్తాడ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది బాలుడిని జిల్లా కేంద్రానికి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

జీపీ సిబ్బంది సమాచారంతో..

మోర్తాడ్: మండలం కేంద్రంలోని వరదకాలువ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బాలుడిని మంగళవారం వదిలివెళ్లారు. బాలుడు ఏడవడంతో గమనించిన జీపీ సిబ్బంది వెంటనే పోలీస్, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- బాడ్సిలో ఓ ఇంటిపై దాడి

మోపాల్: నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం బాడ్సిలో మంగళవారం పోలీసులు గ్రామానికి చెందిన ప్రసాద్ ఇంటిపై దాడి చేసి రూ.6.25 లక్షల విలువైన 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడిలో జరిగింది. అనంతరం పీఎస్‌లో ఎస్సై గంగాధర్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేసే కనుగుల ప్రసాద్ తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో ఆరు నెలలుగా గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడి చేయగా 5 సంచుల్లో గంజాయి లభించిందన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన గుణవంతు రావు నుంచి ప్రసాద్ గంజాయిని కిలో రూ.10 వేలకు కొని రూ.25 వేలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా బెంగళూరు, ఇతర రాష్ట్రాలకు గంజాయిని సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

- బాలిక మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

మద్నూర్: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ బాలిక మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. డోంగ్లి మండలంలోని లింబూర్‌వాడి గ్రామానికి చెందిన ఇద్దరు అన్నతమ్ముళ్లు రాజు, చందు మరో తమ్ముడు కుమార్తె అయిన సాన్వికతో కలిసి బైక్‌పై శుభకార్యం నిమిత్తం మద్నూర్‌కు సోమవారం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తడిహిప్పర్గా వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సాన్వికా అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మద్నూర్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



సాన్విక (ఫైల్)

ఒకరిపై కేసు నమోదు

రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గాపారంలో అంబేద్కర్ విగ్రహ దిమ్మెను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి సాజిద్ అనే వ్యక్తి లారీతో వేగంగా వచ్చి విగ్రహాన్ని ఢీకొనడంతో ధ్వంసమైందన్నారు. స్థానికుడు పీరాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని జాతీయ రహదారిపై మంగళవారం ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొడప్‌గల్ మండలం తలాబ్‌తండాల్లో ఇంటి నిర్మాణం కోసం స్లాబ్ వేసేందుకు మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన వెంకటేశ్ శంబాజీ బన్సుడే(25), వాగ్మారే నిఖిల్ (20)తో పాటు సూర్యవంశీ సోమ్‌నాథ్ బైక్‌పై వస్తున్నారు. హైదరాబాద్ వైపు నుంచి వెళ్తున్న కారు వీరిని ఢీకొనడంతో శంబాజీ బన్సుడే, నిఖిల్ ఇద్దరు మృతి చెందగా, బైక్‌పై ఉన్న మూడోవ్యక్తి సూర్యవంశీతోపాటు కారులోని మ రొకరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని సీఐ నరేశ్ పరిశీలించారు. మృతుడు నిఖిల్ తండ్రి వాగ్మారే యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా..



రాములు(ఫైల్)

సదాశివనగర్: మండల శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం టేక్రియాల్‌కు చెందిన చీకోటి బుగ్గ రాములు(53) సదాశివనగర్ మండలం కల్వరాల్‌లో అంత్యక్రియలకు హాజరై బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా సదాశివనగర్ శివారులో వెనుక నుంచి చెరుకు లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంగవ్వ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

గాంధారి: మండల కేంద్రానికి చెందిన చీమల్వార్ శ్రీకాంత్(29) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో శ్రీకాంత్ ఆదివారం గ్రామ శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన బంధువులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

ఆర్మూర్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి–జాతీయరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని పర్వతం తాతయ్య (60) అనే వృద్ధుడు మృతి చెందాడు. ములుగు జిల్లా ఏటూరు మండల కేంద్రానికి చెందిన ఆయన కొన్నేళ్లుగా మామిడిపల్లిలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం చర్చికి వెళ్లి వస్తుండగా రోడ్డు దాటే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు పోశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

పండ్ల బండిని ఢీకొన్న ఆటో

బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్ కాలనీలో సోమవారం రాత్రి పండ్ల బండిని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ఒకరికి గాయాలైనట్లు సీఐ వీరయ్య తెలిపారు. రాకాసీపేట్ కాలనీకి చెందిన షేక్ యూసుఫ్ పట్టణంలో తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం రాత్రి వ్యాపారం ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో యూసుఫ్‌కు గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు షేక్ ఆరిఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లింగంపేటలో బైక్ చోరీ

లింగంపేట: మండల కేంద్రంలో ఓ బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన నారాగౌడ్ తన బైక్‌ను సోమవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.